సాక్షి
వికారాబాద్
ఆదివారం । 2 । జూలై । 2023



ఆలయాలే లక్ష్యంగా..

తాండూరు మండల పరిధిలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. ఆలయాలే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్నారు. 8లో▸



వికారాబాద్‌లో 'మీతో నేను'

వార్డుల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్ అధికారులను ఆదేశించారు. 8లో▸



'సాగు' ఎలా?

పంటల సాగులో అవసరమైన సలహాలు, సూచనలు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

స్పోర్ట్స్ స్కూల్‌లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

బొంరాస్‌పేట: స్పోర్ట్స్ స్కూల్‌లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని బొంరాస్‌పేట, కొడంగల్, దుద్యాల మండలాల ఎంఈఓ కే.రాంరెడ్డి తెలిపారు. మంగళవారం బొంరాస్‌పేట, దుద్యాల మండలాల విద్యార్థులకు ఈనెల 4న బొంరాస్‌పేట జెడ్పీహెచ్‌ఎస్‌లో, కొడంగల్ మండల స్టూడెంట్లకు స్థానిక హైస్కూల్ ప్రాంగణంలో క్రీడా సామర్థ్యాల పరిశీలన, ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. నాలుగో తరగతిలో ప్రవేశం కోసం 8నుంచి 9 సంవత్సరాల వయసు, ఐదో తరగతిలో చేరే వారు 9నుంచి 10 ఏళ్ల వయసు కలిగి ఉండాలని సూచించారు. వివరాలకు బొంరాస్‌పేట హెచ్‌ఎం పాపిరెడ్డి: 9441945013, దుద్యాల పీఈటీ అనిల్: 7569679478, కొడంగల్ పీఈటీ హన్మంతు: 9492352203 సంప్రదించాలని సూచించారు.

కుల్కచర్ల, చౌడాపూర్‌లో సెలెక్షన్స్..

కుల్కచర్ల: క్రీడా పాఠశాలలో అడ్మిషన్ల కోసం ఈ నెల 4న కుల్కచర్ల హైస్కూల్‌లో, 5న చౌడాపూర్ హైస్కూల్‌లో సెలెక్షన్స్ నిర్వహించనున్నట్లు ఎంఈఓ హబీబ్ తెలిపారు. నాలుగు, ఐదు తరగతుల్లో చేరే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.వివరాలకు ఫోన్:9346688541,8187891301 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

నవాబుపేటలో ఎంపికలు..

నవాబుపేట: ప్రభుత్వ పాఠశాలల్లో 4, 5 తరగతులు చదువుతున్న విద్యార్థులకు స్పోర్ట్స్ స్కూల్‌లో అడ్మిషన్ల కోసం 5న మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సెలెక్షన్స్ నిర్వహించనున్నట్లు ఎంఈఓ గోపాల్ తెలిపారు. వివరాలకు ఫోన్: 9959570559, 9110701442, 9989071269 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక




ఫయాజుద్దీన్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

బంట్వారం: బీఆర్‌ఎస్ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. కోట్‌పల్లి మండలం మోత్కుపల్లి మాజీ సర్పంచ్ ఫయాజుద్దీన్ తదితరులు శనివారం వికారాబాద్‌లో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ గూటికి చేరారు. వీరికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎల్లవేళలా కార్యకర్తలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. 2024లో మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు సుందరి అనిల్, ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలు తెలియకే నేరాలు

తాండూరు జూనియర్‌సివిల్ జడ్జి శివలీల



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి

బషీరాబాద్: చట్టాలపై అవగాహన తీసుకురావడానికే న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తాండూరు జూనియర్ సివిల్ జడ్జి శివలీల అన్నారు. మండల పరిధిలోని జీవన్గీలో శనివారం నిర్వహించిన న్యాయసేవా సదస్సుకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. చట్టం ముందు అందరూ సమానులేనని తెలిపారు. వివిధ కేసుల్లో చిక్కుకుని లాయర్లను పెట్టుకోలేని స్థితిలో ఉన్నవారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్టు తెలిపారు. బ్యాల వివాహాల నిర్మూలన, విద్యాభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. చట్టాల గురించి తెలియని వారే నేరాలకు పాల్పడుతున్నారని, క్రయవిక్రయాలు, లావాదేవీల్లో మోసాలకు గురువుతున్నారని, వివాదాల్లో చిక్కుకుని ఆస్తుల కోసం కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని వివరించారు. కల్తీ విత్తనాలతో నష్టపోయిన రైతులు పరిహారం పొందేలా వినియోగదారుల హక్కుల చట్టంపై చైతన్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్‌ల ద్వారా రాజీకి వీలున్న కేసులను పరిష్కరిస్తున్నామని స్పష్టంచేశారు. ఎంపీపీ కరుణ, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు నవనీతారెడ్డి, ప్రియాంక, తాండూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, న్యాయవాదులు విశ్వనాథం, రాంరెడ్డి, రవికుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, శివకుమార్, గుండప్ప, శ్రావణ్‌కుమార్, రవికుమార్, ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ ఉన్నారు.



పరిగి: పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ కోటిరెడ్డి



వికారాబాద్ అర్బన్: వికారాబాద్‌లో తనిఖీ చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి



తాండూరు టౌన్: బాయ్ మమ్మీ.. తల్లికి టాటా

ప్రశాంతంగా గ్రూప్– 4

జిల్లాలో శనివారం నిర్వహించిన గ్రూప్– 4 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ కోటిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. గంట ముందుగానే అభ్యర్థులు సెంటర్లకు చేరుకున్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి పలు కేంద్రాలను తనిఖీ చేసి, పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లకు తావీయొద్దని అధికారులను ఆదేశించారు.



వికారాబాద్ అర్బన్: అభ్యర్థులను చెక్ చేస్తున్న పోలీసులు

గులాబీ నేతల దూకుడు





ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి



ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరులో రసవత్తర రాజకీయం

- జోరు పెంచిన పట్నం, పైలెట్
- ప్రజలను ఆకట్టుకునే పనిలో ఇద్దరు నాయకులు
- బీఆర్‌ఎస్ టికెట్‌పై ఎవరి ధీమా వారిదే

తాండూరు: తాండూరు రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి దూకుడు పెంచారు. నిన్నమొన్నటి వరకు పట్నం పార్టీ మారుతారనే చర్చ సాగినా.. సీఎం కేసీఆర్‌తో భేటీ తర్వాత అంతా తూచ్ అని తేలింది. మరోవైపు యాగాలు, పూజల పేరుతో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సైతం హంగామా చేస్తున్నారు. ఇదిలా ఉండగా వచ్చే ఎన్నికల్లో అధికార పార్టీ తరఫున పోటీ చేసేది నేనంటే.. నేనేనని ఎవరికి వారే ప్రచారం చేసుకుంటున్నారు. దీంతో టికెట్ ఎవరిని వరిస్తుందో తెలియక అటు పార్టీ శ్రేణులు.. ఇటు నియోజకవర్గ ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.

తగ్గేదే లేదు..

దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి కంచుకోటలా ఉన్న తాండూరు అసెంబ్లీ స్థానంలో బీఆర్‌ఎస్ జెండా ఎగుర వేసేందుకు అధిష్టానం పావులు కదుపుతోంది. అయితే ఇక్కడ పార్టీలో నెలకొన్న వర్గపోరు తలనొప్పిగా మారింది. తెలంగాణ ఏర్పాటు తర్వాత 2014లో తాండూరు అసెంబ్లీ నుంచి టీఆర్‌ఎస్ తరఫున పట్నం మహేందర్‌రెడ్డి పోటీ చేసి గెలుపొందారు. 2018లోనూ గులాబీ టికెట్‌తో పోటీచేసి.. కాంగ్రెస్ అభ్యర్థి రోహిత్‌రెడ్డి చేతిలో ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలతో రోహిత్‌రెడ్డి అధికార పార్టీలో చేరారు. దీంతో ఇద్దరూ బలమైన నేతలుగా మారారు. తగ్గేదే లేదంటూ తాండూరు అసెంబ్లీ స్థానం కోసం పోటాపోటీగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. అనూహ్య ఓటమి తర్వాత ఎమ్మెల్సీగా గెలుపొందిన మహేందర్‌రెడ్డి జిల్లాలో మరోసారి తన సత్తా చాటుకున్నారు. తాండూరులో తన మార్క్ చూపించే దిశగా ఇటీవల మరింత వేగంగా పావులు కదుపుతున్నారు. యువతను ఆకట్టుకునే వ్యూహంలో భాగంగా తన కుమారుడు రినీష్‌రెడ్డిని రంగంలోకి దింపారు. పీఎమ్మార్ ట్రస్ట్ పేరిట క్రీడా పోటీలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. తాండూరులో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విన్నర్ జట్టుకు రూ.2 లక్షలు, రన్నర్ జట్టుకు రూ.50 వేల చొప్పున ప్రైజ్ మనీతో పాటు ట్రోఫీలు అందజేశారు. రానున్న రోజుల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పీఎమ్మార్ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

పైలెట్ సందడి..

స్థానిక ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మరోసారి గెలుపే లక్ష్యంగా నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరిన తర్వాత.. ఎమ్మెల్యే హోదాలో పార్టీ కార్యక్రమాలతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలన్నీ రోహిత్ చేతికి చిక్కాయి. ఈ నేపథ్యంలో తాండూరు రాజకీయాలను మూడున్నరేళ్లుగా తనవైపు తిప్పుకోవడంలో కొంతవరకు సక్సెస్ అయ్యారు. కానీ కొద్ది రోజులుగా కాలం ఆయనకు కలిసి రావడంలేదు. గత ఎన్నికల సమయంలో వెన్నంటి నడిచిన నాయకులంతా ఒక్కొక్కరుగా దూరమయ్యారు. దీంతో నాయకుల కన్నా.. ప్రజల ఆశీస్సులే కీలకమని నిర్ణయించుకుని వారి దృష్టిని ఆకర్షించే పనిలో పడ్డారు. పట్టణంలో నిర్మించిన నూతన ఇంట్లోకి.. గత నెల 7న ఘనంగా గృహప్రవేశం చేశారు. ఈ వేడుకకు 25 వేల మందిని ఆహ్వానించి అన్నదానం చేశారు. మరో వైపు ఆదివారం నుంచి తన ఇంటి ముందు రాజశ్యామల యాగం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. 11 వేల జంటలతో యాగానికి సిద్ధమయ్యారు. ఇందుకోసం దేశంలోకి ప్రముఖ పీఠాలు, మఠాల అధిపతులను ఆహ్వానించారు.

రేవంత్‌వి పగటి కలలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

- ఎమ్మెల్యేగా గెలవలేని వ్యక్తి సీఎం అవుతాననడం హాస్యాస్పదం
- ఎక్కడి నుంచి పోటీ చేసినా ఆయనకు ఓటమి తప్పదు
- కాంగ్రెస్‌కు 12 సీట్లకు మించి రావు
- కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి
- కర్ణాటకలో తెలంగాణ పథకాలను అమలు చేయించాలని డిమాండ్

కొడంగల్ రూరల్: ఎమ్మెల్యేగా గెలవలేని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సీఎం అవుతానని పగటి కలలు కంటున్నాడని కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అంతకుముందు ఇటీవల మృతిచెందిన తెలంగాణ ఉద్యమకారుడు సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతర మాట్లాడుతూ.. గతంలో యాభై ఏళ్లు పాలించిన కాంగ్రెస్ ఇలాంటి పథకాలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రగల్భాలు పలకడం రేవంత్‌కు కొత్తేమీ కాదని ఎద్దేవా చేశారు. ఖమ్మం సమావేశంలో ఎకరాకు రూ.15 వేల రైతుబంధు ఇస్తామని చెప్పిన ఆయన ముందు కర్ణాటక రైతులకు ఇప్పించాలని సూచించారు. తెలంగాణలో అమలవుతున్న రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, మిషన్ భగీరథ వంటి కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎందుకు లేవని నిలదీశారు. హస్నాబాద్‌లో జిమ్మిక్కుతో మొదటిసారి, ఓట్ల చీలికతో రెండోసారి గెలిచిన రేవంత్‌రెడ్డికి మూడోసారి కొడంగల్ ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. పూటకో మాట మాట్లాడుతున్న ఆయనకు ఎక్కడ పోటీ చేసినా ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. కోస్గిలో నిర్వహించిన సభలో కొడంగల్ నుంచే 119 బీఫామ్‌లు ఇస్తామన్న రేవంత్.. మాట మార్చి సర్వే ప్రకారమే బీ ఫామ్‌లు వస్తాయని చెప్పడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి 10నుంచి 12 సీట్లకు మించే పరిస్థితి లేదన్నారు. అసలు తాను ఎక్కడి నుంచి పోటీ చేయాలో తెలియని అయోమయంలో ఉన్న రేవంత్‌రెడ్డిని ఎక్కడ పోటీ చేసినా ఓడించి తీరుతామని ధీమా వ్యక్తంచేశారు. తొమ్మిదేళ్లుగా ప్రజలను కవలని రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా లాభపడ్డాడని, ఎన్నికల్లో వారే ఆయనకు బుద్ధి చెబుతారని తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై సర్వే చేయించిన కేంద్ర ప్రభుత్వం అనేక అవార్డులు సైతం అందజేసిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ క్షేత్రస్థాయి నుంచి వచ్చిన నాయకుడు, రైతు బిడ్డ కావడంతో అన్ని వర్గాల ప్రజల కష్టసుఖాలపై స్పష్టమైన అవగాహన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ ఎంపీపీ విజయకుమార్, జెడ్పీటీసీ కోట్ల మహిపాల్, బీఆర్‌ఎస్ నేతలు సలీం, మోహన్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, ప్రమోద్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

- ప్రేమవివాహం నేపథ్యంలో ఇరు కుటుంబాల మధ్య గొడవలు
- కత్తులతో దాడికి పాల్పడిన అన్నదమ్ములు
- మోత్కూర్‌లో ఘటన
- పరారీలో నిందితులు



చంద్రయ్య (ఫైల్)



పరిగి ఆస్పత్రిలో చంద్రయ్య మృతదేహం

దోమ: ఇద్దరు మహిళల మధ్య జరిగిన ఘర్షణ ఓ వ్యక్తి దారుణ హత్యకు దారితీసింది. ఈ ఘటన దోమ పోలీస్ స్టేషన్ పరిధిలోని మోత్కూర్‌లో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గునియాడి చంద్రయ్య(35) సోదరుడైన రాములు కూతురు జ్యోతిని.. ఇదే ఊరికి చెందిన సంది సాయిలు చిన్న కుమారుడు మహేశ్ రెండు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ పెళ్లి చంద్రయ్యకు ఇష్టం లేదని సమాచారం. ప్రేమ పెళ్లి విషయమై గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టిన స్థానికులు ఇరు కుటుంబాలకు సర్దిచెప్పారు. ఇదిలా ఉండగా శనివారం ఉదయం చంద్రయ్య భార్య శమంత, సాయిలు భార్య ఎల్లమ్మతో వాగ్వాదానికి దిగి ఘర్షణకు పాల్పడింది. ఈ సమయంలో ఎల్లమ్మపై దాడి చేయమని చంద్రయ్య తన భార్యను ప్రోత్సహించాడు. ఈ విషయాన్ని ఎల్లమ్మ తన కుమారులకు చెప్పింది. దీంతో ఆగ్రహానికి గురైన ఆమె ఇద్దరు కొడుకులు చంద్రయ్యపై దాడికి నిర్ణయించుకున్నారు. పరిగి పట్టణంలో మేస్త్రీ పని చేసుకుని సాయంత్రం ఇంటికి వస్తున్న క్రమంలో భీమయ్య, మహేశ్ కత్తులతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో తీవ్ర రక్తస్రావమైన చంద్రయ్యను పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. అన్నదమ్ములిద్దరూ పరారీలో ఉన్నారు.

కేసు నమోదు

హత్య విషయం తెలుసుకున్న ఎస్ఐ విశ్వజన్ తన సిబ్బందితో గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆస్పత్రికి వెళ్లి ఆరా తీశారు. దాడికి పాల్పడిన నిందితులిద్దరూ పరారీలో ఉన్నారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మెట్రో ప్రయాణికులు @ 40 కోట్లు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మెట్రో రైల్ చరిత్ర సృష్టించింది. నగరంలో మెట్రో రైళ్లను ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రయాణికుల సంఖ్య 40 కోట్లకు చేరుకుంది. 2017 నవంబర్ 29న నగరంలో మెట్రో సేవలను ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు రోజు రోజుకు ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నట్లు హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. తొలుత నాగోల్ నుంచి అమీర్‌పేట్ వరకు మెట్రో రైలు పరుగులు తీసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఎల్బీనగర్ నుంచి అమీర్‌పేట్ మీదుగా మియాపూర్ వరకు.. నాగోల్ నుంచి అమీర్‌పేట్ మీదుగా రాయదుర్గం వరకు మెట్రో రైళ్లు పరుగులు తీశాయి. అదేవిధంగా జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు మెట్రో అందుబాటులోకి వచ్చింది. దశలవారీగా ప్రయాణికుల రద్దీతో పాటే ట్రిప్పుల సంఖ్య సైతం పెరిగింది. ప్రస్తుతం ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు సుమారు వెయ్యి ట్రిప్పులు తిరుగుతున్నట్లు అంచనా. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వివిధ మార్గాల్లో ట్రిప్పుల సంఖ్యను పెంచేందుకు హెచ్ఎంఆర్ చర్యలు చేపట్టింది.

జీవనం చెల్లాచెదురు



రైలు పట్టాలపై చెల్లాచెదురుగా పడిఉన్న గొర్రెలు

- గొర్ల మందను మింగిన 'హుబ్లీ'
- రైలు ఢీకొని 50 జీవాలు మృత్యువాత
- మరో పదిహేనింటికి తీవ్ర గాయాలు
- దోర్నాల్‌లో ఘటన

ధారూరు: ప్రాణప్రదంగా పెంచుకుంటున్న 50 గొర్రెలు కనురెప్ప పాటులో ప్రాణాలు కోల్పోయి.. చెల్లాచెదురుగా పడిపోయాయి. ఇవే జీవనాధారంగా బతుకుతున్న కాపరి గుండెలవిసేలా రోదించాడు. ధారూరు మండలంలో శనివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. దోర్నాల్ గ్రామానికి చెందిన కిష్టయ్యకు 120 గొర్రెలు ఉన్నాయి. ఉదయం వీటిని మేతకు తీసుకెళ్లాడు. సాయంత్రం తిరిగి వస్తుండగా స్టేషన్ ధారూరు వద్ద పొదల్లో ఉన్న ఊరపందుల గుంపును చూసి బెదిరిన గొర్రెలు ఒక్కసారిగా పరుగు తీసి రైలు పట్టాలపైకి చేరుకున్నాయి. ఇదే సమయంలో నాంపల్లి నుంచి హుబ్లీ వెళ్తున్న ట్రైన్ వేగంగా వచ్చి జీవాలను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో 50 గొర్రెలు మృతిచెందగా మరో 15 తీవ్రంగా గాయపడ్డాయి. చనిపోయిన గొర్రెల విలువ రూ.6.50 లక్షలు ఉంటుందని బాధితుడు కిష్టయ్య తెలిపాడు. జీవాల మృతితో తన బతుకు ఆగమైందని, ప్రభుత్వం ఆదుకోవాలని కన్నీటి పర్యంతమయ్యాడు. కిష్టయ్యకు న్యాయం చేయాలని స్థానిక సర్పంచ్ సుజాత రైల్వేశాఖ అధికారులకు విన్నవించారు.



జుంటుపల్లి రామస్వామి ఆలయ ఆవరణలో కార్యకర్తలతో జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

కార్యకర్తలకు అండగా నిలుస్తాం

యాలాల: కార్యకర్తలు, అభిమానులు కుటుంబ సభ్యులతో సమానమని, వారికి ఎల్లవేళలా అండగా ఉండి సేవలందిస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని జుంటుపల్లి రామస్వామి ఆలయ ఆవరణలో సునీతారెడ్డి అభిమాని చాంద్‌పాషా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా, మంత్రిగా మహేందర్‌రెడ్డి, మూడుసార్లు జెడ్పీ చైర్‌పర్సన్‌గా తాను తాండూరు అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశామన్నారు. పీఎంఆర్ ట్రస్టు ద్వారా రినీష్‌రెడ్డి ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎవరైనా తమ కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. రామస్వామి ఆలయ ఆవరణలో అన్నదానం చేసిన చాంద్‌పాషను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కరణం పురుషోత్తంరావు, రవిగౌడ్, విజయలక్ష్మి, సురేందర్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా నవీన్


నవీన్

వికారాబాద్ అర్బన్: ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా వికారాబాద్‌కు చెందిన నవీన్ నియమితులయ్యారు. జూన్ 28, 29, 30 తేదీల్లో పాలమూరులో ఏబీవీపీ ప్రాంత అభ్యాసవర్గ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి నవీన్‌కు బాధ్యతలు అప్పగించారు.

దంపతులకు తీవ్ర గాయాలు

బైక్‌ను కారు ఢీకొట్టడంతో ప్రమాదం

పరిగి: కారు బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన పట్టణ కేంద్రంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి వివరాల ప్రకారం.. పరిగి నుంచి కొడంగల్ వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వికారాబాద్ మండలం ఐనాపూర్ గ్రామానికి చెందిన పిల్లి శేఖర్, అతని భార్య మమతకు తీవ్ర గాయాలయ్యాయి. పక్కనే విధులు నిర్వహిస్తున్న పోలీసులు గమనించి వెంటనే తమ వాహనంలో చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం శేఖర్‌ను నగరానికి, మమతను వికారాబాద్ ఆస్పత్రికి తరలించారు. అజాగ్రత్తగా కారు నడిపిన డ్రైవర్ హనుమంత్‌పై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కరన్‌కోట్‌లో వ్యక్తి ఆత్మహత్య

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్‌లో శనివారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుర్వమల్లప్ప(35).. కొడంగల్ మండలం ఎరన్‌పల్లిలో కూలీ పనులు చేసుకుంటూ భార్య నాగమ్మ వద్ద ఉండేవాడు. ఆమెతో గొడవపడి 15 రోజుల క్రితం కరన్‌కోట్‌కు వచ్చాడు. శనివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి చెప్పారు.

వివాహిత అదృశ్యం


అనూష (ఫైల్)

పూడూరు: వివాహిత అదృశ్యమైన సంఘటన చన్గోముల్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ గిరి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన తొండపల్లి అనూష, ప్రవీణ్ దంపతులు. జూన్ 30న అనూష ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. బంధువులు, కుటుంబీకుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం చన్గోముల్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కిషోర బాలికలకు స్వయం ఉపాధి శిక్షణ

మొయినాబాద్: జిల్లాలోని కిషోర బాలికలకు స్వయం ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు దుర్గాబాయి మహిళ శిశు వికాస కేంద్రం జిల్లా అధికారి శైలకుమారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని చిలుకూరులో ఉన్న మహిళ శిశు వికాస కేంద్రం (మహిళా ప్రాంగణం)లో బ్యూటీషియన్ (రెండు నెలలు), టైలరింగ్ (మూడు నెలలు), మగ్గం వర్క్ (రెండు నెలలు) కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. 15–18 సంవత్సరాల వయసున్న కిషోర బాలికలు విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఈ నెల 5వ తేదీలోగా చిలుకూరు ప్రాంగణంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆలయాలే లక్ష్యంగా..

- రెచ్చిపోతున్న దొంగలు
- జినుగుర్తిలో భవానీమాత విగ్రహం చోరీ
- మూడు నెలల క్రితం దత్తాత్రేయ విగ్రహం మాయం
- కేసుల ఛేదనలో పోలీసులు విఫలం
- ఆందోళనలో భక్తులు, గ్రామస్తులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తిలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. దేవుడి విగ్రహాలకు రక్షణ లేకుండాపోయింది. క్షుద్రపూజల కోసం విగ్రహాలను చోరీ చేస్తున్నారా..? లేదా ఇంకేమైనా చేస్తున్నారా..? అని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామ శివారులో శ్రీరామలింగేశ్వరస్వామి పురాతన ఆలయం ఉంది. గర్భగుడిలో పంచలోహ భవానీ మాత విగ్రహం ఉంది. ప్రతీ శివరాత్రికి పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులు ఇక్కడ అమ్మవారికి పూజలు చేస్తారు. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితం పూజారి ఆలయానికి వెళ్లేసరికి అమ్మవారి విగ్రహం చోరీకి గురైంది. గుర్తు తెలియని దుండగులు గర్భాలయం నుంచి విగ్రహాన్ని ఎత్తుకెళ్లారు. అమ్మవారి విగ్రహానికి కట్టిన వస్త్రాలు గుడి బయట గుండం వద్ద పెట్టి వెళ్లిపోయారు. ఈ విషయమై ఆలయ చైర్మన్ ప్రవీణ్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కనిపించని పురోగతి

జినుగుర్తి గేటు వద్ద ఆదిబసవన్న ఆలయం పక్కనే ఉన్న మర్రిచెట్టు కింద దత్తాత్రేయ విగ్రహం చోరీకి గురైంది. కొద్ది రోజుల క్రితం విగ్రహాన్ని పెకిలించి తీసుకెళ్లిన దుండగులు ఆ స్థానంలో రాగిచెంబు పెట్టి వెళ్లిపోయారు. ఈ విషయమై కేసు నమోదైనా ఇప్పటికీ ఎలాంటి పురోగతి లేదు.

విమర్శల వెల్లువ

గ్రామాల శివార్లలోని ఆలయాలే లక్ష్యంగా తరచూ చోరీలు జరుగుతున్నాయి. హుండీలు పగలగొట్టడం, విలువైన సామగ్రితో పాటు గర్భాలయంలో విగ్రహాలు చోరీకి గురవుతున్నా పోలీసులు పెద్దగా పట్టించుకోవడం లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మూడు నెలల క్రితం చోరీకి గురైన దత్తాత్రేయ విగ్రహాన్ని ఎవరు ఎత్తుకెళ్లారో ఇప్పటికీ తేలలేదు. కనీసం ఆదిశగా చర్యలేవీ తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే అదనుగా భావిస్తున్న దొంగలు యథేచ్ఛగా తమ పని కానిచ్చేస్తున్నారు. భవానీమాత విగ్రహం కూడా చోరీ కావడంతో కరన్‌కోట్ పోలీసుల పనితీరుపై ప్రజలు, భక్తుల్లో అసహనం వ్యక్తమవుతోంది.


జినుగుర్తిలోని రామలింగేశ్వరాలయంలో చోరీకి గురైన భవానీ మాత విగ్రహం

వెబ్ సీరియల్ చిత్రీకరణ

షాద్‌నగర్ రూరల్: పట్టణ శివారులోని వివేకానంద కళాశాల ఆవరణలో డ్యాన్స్ మాస్టర్ శివ, నిర్మాత అనిల్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న 'నాన్న' అనే సందేశాత్మక వెబ్ సీరియల్‌ను చిత్రీకరించారు. ఈ సీరియల్‌లో శంకర్ జాదవ్ హీరోగా, గీతిక హీరోయిన్‌గా, ప్రొఫెసర్‌గా టీవీ రంగయ్య నటిస్తున్నారు. ఈ సందర్భంగా సీరియల్ యూనిట్ సభ్యులు మాట్లాడుతూ.. యువత తమ జీవితాలను ఉన్నతంగా మలచుకోవడానికి తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడుతుంటారని పేర్కొన్నారు. అయితే యువత వినోదాలు, విలాసాలకు అలవాటు పడి ప్రేమలు, పెళ్లిళ్లు అంటూ పక్కదారి పడుతున్నారని తెలిపారు. యువత పక్కదారి పట్టకుండా వారిని చైతన్య పరిచేందుకే 'నాన్న' పేరుతో వెబ్ సీరియల్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు.


సీరియల్ చిత్రీకరణలో యూనిట్ సభ్యులు

వికారాబాద్‌లో 'మీతో నేను'

- 28, 32వ వార్డుల్లో ఎమ్మెల్యే ఆనంద్ పర్యటన
- స్థానిక సమస్యలపై ఆరా
- పరిష్కారానికి ఆదేశం

వికారాబాద్ అర్బన్: వార్డుల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కౌన్సిలర్లకు సూచించారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 28వ వార్డు గాంధీ కాలనీ, 32వ వార్డు శివరాంనగర్‌లో మీతో నేను కార్యక్రమం నిర్వహించారు. వార్డుల్లో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. కాలనీలో పాడుబడ్డ ఇళ్లను వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గాంధీ కాలనీలోని పాత పీఎస్ వెనుకాల ఉన్న పోలీస్ క్వార్టర్స్‌ను తొలగించేలా ఎస్పీతో మాట్లాడారు. పాత స్తంభాల స్థానంలో కొత్తవి పాతాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల విషయంలో నిర్లక్ష్యం తగదని మున్సిపల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మోముల స్వాతిరాజ్‌కుమార్, నవీన్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్య తెలంగాణే లక్ష్యం

వికారాబాద్ అర్బన్: ఆరోగ్య తెలంగాణ సాధనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. రాజీవ్ నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం రేడియాలజీ, పాథాలజీ ఆఫ్ గ్రేడేషన్(134 రకాల పరీక్షలు) హబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ పేద ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతో వికారాబాద్‌లో రేడియాలజీ, పాథాలజీ ఆఫ్ గ్రేడేషన్ హబ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేశ్, డీఎంహెచ్ఓ డాక్టర్ పాల్వాన్ కుమార్, ఎంపీపీ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.


రేడియాలజీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

మట్టి.. కొల్లగొట్టి

చెరువులను తవ్వేస్తున్న అక్రమార్కులు

- యథేచ్ఛగా వాహనాల్లో తరలింపు
- 'సొమ్ము' చేసుకుంటున్న వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు

కొత్తూరు: 'మా ఇటుక బట్టీలకు మట్టి అవసరం.. మీ గ్రామ సమీపంలోని చెరువులో నల్లమట్టి (ఒండ్రు) ఉంది. మీరు అడిగింది ఇస్తాం. మాకు సహకరించండి.. ఎవరికీ అనుమానం రాకుండా రాత్రికి రాత్రే జేసీబీలు, టిప్పర్లతో మట్టిని తీసుకుపోతాం.. డబ్బులు కాస్త ఎక్కువైనా పర్లేదు ఇచ్చేస్తాం' అంటూ అక్రమార్కులు ఆయా గ్రామాల సర్పంచ్‌లకు ఆఫర్లు ఇస్తున్నారు. దీంతో పలువురు సర్పంచులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో వ్యాపారులు తాము ఎంచుకున్న చెరువు నుంచి పెద్ద మొత్తంలో మట్టి, మొరంను తరలించుకుపోతున్నారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించిన దాఖలాలు లేవు. ఇటీవల ఓ పంచాయతీ పరిధిలోని చెరువులో వందల ట్రిప్పుల మట్టిని తరలించినప్పటికీ విషయం బయటకు రాకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

త్వరగా ఇంకుతున్న నీరు..

అక్రమ మట్టి వ్యాపారులు కనీస నిబంధనలు పాటించకుండా చెరువుల్లో నుంచి జేసీబీ, యంత్రాల ద్వారా తవ్వకాలు జరపడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. దీంతో భారీ వర్షాలు కురిసినప్పటికీ చెరువుల్లో నీరు ఎక్కువ రోజులు నిల్వ లేకుండా ఇంకుతున్నాయి. దానికి తోడు మట్టిని తరలించే క్రమంలో పలు చెరువుల కట్టలు సైతం ధ్వంసమై లీకేజీలు ఏర్పడుతున్నాయి. ఇప్పటికే మండలంలోని సిద్ధాపూర్, పెంజర్ల, ఇన్ముల్‌నర్వ, కొత్తూరుతో పాటు పలు చెరువుల్లో వందల ట్రిప్పుల మట్టి, మొరంను గుట్టుచప్పుడు కాకుండా విక్రయించారు. వీరికి కొందరు స్థానిక ప్రజా ప్రతినిధులు సహకరిస్తుండడంతో వ్యాపారం మూడు పూలు.. ఆరు కాయలు అన్నచందంగా సాగుతోంది.

చర్యలు నామమాత్రమే..

చెరువులు, కుంటల్లో అక్రమంగా తవ్వకాలు జరిపే వారిపై సంబంధిత అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమంగా మట్టి తరలించే వాహనదాసుల సీజ్ చేసి, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


పెంజర్లలోని మామిదోని చెరువులో మట్టి తవ్వకాలు

రక్షణ అందరి బాధ్యత



వరద నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాల పెంపునకు చెరువులు, కుంటలు ప్రధాన ఆదరువులు. వాటిల్లో అనుమతి లేకుండా మట్టి, మొరం, తవ్వకాలు జరపడం నేరం. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం.

– రవీందర్, ఇరిగేషన్ ఏఈ, కొత్తూరు

వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తాం


కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేస్తున్న బీజేపీ నేతలు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

మహేశ్వరం: త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధిక స్థానాలు కైవసం చేసుకొని అధికారం చేపట్టబోతోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి శనివారం మండల పరిధిలోని ఘట్టుపల్లిలో ఇంటింటా తిరిగి ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రానికి ప్రధానిమోదీ వివిధ సంక్షేమ పథకాలు కేటాయిస్తుంటే సీఎం కేసీఆర్ ప్రజలకు తెలియకుండా దాస్తున్నారన్నారు. సొమ్ము కేంద్రానిది సోకు మాత్రం కేసీఆర్‌ది అన్నట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో మహేశ్వరం గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తామని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు పాపయ్య గౌడ్, సుధాకర్ శర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు టి.యాదిష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధి పనులు వేగిరం చేయాలి

రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్

బడంగ్‌పేట్: గ్రంథాలయాల భవన నిర్మాణ పనులు వేగవంతం చేసి పాఠకులకు అందుబాటులోకి తేవాలని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్ సిబ్బందిని ఆదేశించారు. బడంగ్‌పేటలోని జిల్లా గ్రంథాలయంలో పాఠకులకు అందిస్తున్న సేవలపై శనివారం ఆయన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి, అధికారులతో కలిసి సమీక్షించారు. శంషాబాద్, ఆమనగల్లు గ్రంథాలయాల భవన నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయని అధికారులు వివరించారు. కొత్తూరు, షాబాద్‌లో చేపట్టిన పనులు నెమ్మదిగా కొనసాగుతున్నాయని తెలుసుకుని ఆయా ఇంజనీరింగ్ అధికారులపై మండిపడ్డారు. అనంతరం శ్రీధర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని గ్రంథాల యాల్లో పాఠకులు, నిరుద్యోగులకు అన్ని రకా ల పుస్తకాలు, డిజిటల్ లైబ్రరీలను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో త్వరలో డిజిటల్ లైబ్రరీని ప్రారంభించనున్నట్లు వెంకటరమణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయాల అదనపు డైరెక్టర్ అపర్ణ, జిల్లా కార్యదర్శి మనోజ్‌కుమార్, లైబ్రరీ సిబ్బంది పాల్గొన్నారు.


గంథ్రాలయ సేవలపై సమీక్షిస్తున్న శ్రీధర్

కమిషనర్ బదిలీ

- మూడు నెలల తిరగకముందే శంకర్‌నాయక్ ట్రాన్స్‌ఫర్
- తాండూరు కొత్త మున్సిపల్ కమిషనర్‌గా షఫీయుల్లా

తాండూరు: తాండూరు మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ బదిలీ అయ్యారు. ఈ మేరకు మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని అధికారులు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ నగర పాలక అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసిన ఆయన ట్రాన్స్‌ఫర్‌పై ఇక్కడకు వచ్చారు. గత ఏప్రిల్ 3న బాధ్యతలు చేపట్టారు. చార్జ్ తీసుకున్న మొదటి రోజు నుంచే ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే వర్గాల నాయకుల నుంచి రాజకీయ ఒత్తిడులు అధికమయ్యాయి. మరోవైపు మున్సిపాలిటీలో ఏ పని కావాలన్నా ఇతర శాఖ అధికారుల ప్రమేయం ఎక్కువైంది. ఈ నేపథ్యంలో నిబంధనల మేరకు విధులు నిర్వర్తించారు. పని విషయంలో ఎవరికీ తలొగ్గకుండా పనిచేసిన శంకర్‌నాయక్‌పై బదిలీ వేటు పడింది. ఇదిలా ఉండగా మెప్మా శాఖలో విధులు నిర్వహిస్తున్న షఫీయుల్లాకు బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. తాండూరులో డ్యూటీ కత్తిమీద సాములా మారిందని, ఇక్కడి రాజకీయ ఒత్తిడి నేపథ్యంలోనే ఈ పరిస్థితి నెలకొందని కొంతమంది అధికారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

నూతన నియామకం



షాద్‌నగర్: అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా షాద్‌నగర్‌కు చెందిన రాచూరి విజయేందర్‌రెడ్డిని నియమించారు. శనివారం హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఐన్యూల్ హుస్సేన్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు.

ఉరేసుకుని యువకుడి మృతి

షాద్‌నగర్‌రూరల్: ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వెలిజర్ల గ్రామానికి చెందిన వడ్డె అర్జున్ (23) తల్లిదండ్రులతో కలిసి గ్రామంలోనే నివసిస్తున్నాడు. శనివారం ఉదయం తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లి సాయంత్రం వచ్చే సరికి ఉరివేసుకుని కనిపించాడు.

వైభవంగా రథయాత్ర, పల్లకీసేవ


కొనసాగుతున్న రథోత్సవం

కందుకూరు: గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని కందుకూరు చౌరస్తా నుంచి పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రం వరకు బ్రహ్మశ్రీ గురుజీ అనిల్‌కుమార్‌జోషి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం రథోత్సవం, పల్లకీ సేవ వైభవంగా కొనసాగింది. శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో ప్రతి గురుపౌర్ణమికి మూడు రోజుల పాటు గురుపూజోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. అందులో భాగంగా వివిధ రాష్ట్రాల నుంచి స్వామి నిఖిలేశ్వరానంద విగ్రహాలను పల్లకీలు, రథాలపై ఉంచి సైకిల్, పాదయాత్రల ద్వారా కందుకూరు చౌరస్తాకు పెద్ద ఎత్తున భక్తులు చేరుకున్నారు. అక్కడి నుంచి సాయంత్రం భక్తులు డప్పువాయిద్యాలు, నృత్యాలు, భక్తి కీర్తనలు ఆలపిస్తూ పులిమామిడికి చేరుకున్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బాలికను పెళ్లి చేసుకున్న యువకుడిపై కేసు నమోదు

శంకర్‌పల్లి: బాలికను పెళ్లి చేసుకున్న యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (14) కుటుంబ సభ్యులు రెండు నెలల క్రితం శంకర్‌పల్లిలో ఇంటిని కొనుగోలు చేసి నివాసం మార్చారు. వనపర్తి జిల్లాకి చెందిన రజినీకాంత్ (22) కొన్నేళ్లుగా బాలిక స్వగ్రామంలో ఉంటూ తాపీమేస్త్రీగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బాలికతో సన్నిహితంగా ఉండేవాడు. ఇటీవల బాలికకు మాయమాటలు చెప్పి వివాహం చేసుకున్నాడు. విషయం తెలిసిన బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

40 తులాల బంగారం చోరీ

పహాడీషరీఫ్: ఇంటికి తాళం వేసి అత్తగారింటికి వెళ్లొచ్చేసరికి 40 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ శుభోదయ కాలనీకి చెందిన బి.సంతోష్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా కొనసాగుతున్నాడు. శుక్రవారం రాత్రి ఇంటికి తాళం వేసి ఉప్పల్‌లోని అత్తగారింట్లో ఉన్న శుభ కార్యానికి కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యాడు. శనివారం మధ్యాహ్నం తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించిన స్థానికులు సంతోష్‌కుమార్‌కు ఫోన్ చేశారు. ఇంటికి చేరుకొని పరిశీలించగా అల్మారాలో దాచిన 40 తులాల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ అంజయ్య, ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు.


చేతులకు గోరింటాకు పెట్టుకుంటున్న మహిళలు

గోరింటా పూచింది

అన్నీ శుభాలే కలగాలని కోరుతూ ఏటా ఆషాఢమాసంలో మహిళలు చేతులకు గోరింటాకు పెట్టుకుంటారు. అరచేతుల్లో పెట్టుకునే గోరింటాకు ఎర్రగా పండితే తమ జీవితాలు సైతం ఆనందంగా ఉంటాయని నమ్ముతారు. ఇందులో భాగంగా శనివారం తాండూరు పట్టణంలోని 20వ వార్డు గాంధీనగర్ కౌన్సిలర్ సంగీతా ఠాకూర్‌తో పాటు పలువురు మహిళలు గోరింటాకు పెట్టుకున్నారు. – తాండూరు టౌన్


చేతులకు గోరింటాకు పెట్టుకుంటున్న కౌన్సిలర్, వార్డు మహిళలు